సాక్షి విజయనగరం

మంగళవారం । 8 । ఆగస్టు । 2023



ప్రతి అర్జీని పరిష్కరించాలి

'జగనన్నకు చెబుదాం'లో ప్రజల నుంచి అందే ప్రతి వినతిని పరిశీలించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ అశోక్ ఆదేశించారు. - 8లో



లైంగిక వేధింపుల కేసు

బాలికను లైంగికంగా వేధిస్తున్న వంగర జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిపై కేసు నమోదైంది. - 8లో



13 కేజీల గంజాయి స్వాధీనం

ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న 13 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

స్టాఫ్‌నర్సు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఎస్‌ఎన్‌సీయూ, యూపీహెచ్‌సీ, డీఈఐసీలలో ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సు, డీఈఓ, లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్, సపోర్టింగ్ స్టాఫ్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. విద్యార్హత, ఇతర వివరాలకు విజయనగరం.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం రూరల్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి భాస్కరరావు సూచించారు. గుంకలాం గ్రామంలో రాకోడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై మంగళవారం అవగాహన కల్పించారు. గ్రామ పరిసరాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. మిషన్ ఇంద్రధనుస్సులో భాగంగా పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాలతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కునుకు వెంకటరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి మోపాడ జగదీష్, పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులకు శిక్షణ



విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షించడంపై అవగాహన కల్పిస్తున్న హరికృష్ణ

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో నెల్లిమర్ల, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల వ్యవసాయ ల్యాబ్ అధికారులకు సోమవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు హరికృష్ణ శిక్షణ తరగతులను ప్రారంభించారు. విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షా విధానాలపై అవగాహన కల్పించారు. విత్తన మొలక శాతం, తేమ శాతం లెక్కింపును ప్రయోగాత్మకంగా తెలియజేశారు. రైతుల మేలుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చిందని, నాణ్యత, పరీక్ష విధానంపై సంబంధిత సిబ్బంది అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆరు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అగ్రిటెస్టింగ్ ల్యాబ్ ఏఓలు శ్రీలక్ష్మి, లలిత, పద్మావతి, ప్రసాదరావు, సూరినాయుడు పాల్గొన్నారు.

బుచ్చి అప్పారావు విగ్రహానికి స్థలం కేటాయింపు

- ఈస్ట్‌కోస్ట్ చీఫ్ ఇంజినీర్ సుగుణాకర్



తాటిపూడి జలాశయం వద్ద స్థల పరిశీలన చేస్తున్న చీఫ్ ఇంజినీర్, సంఘం కొప్పలవెలమ సంఘం నాయకులు

గంట్యాడ: గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయం (తాటిపూడి) వద్ద బుచ్చి అప్పారావు విగ్రహానికి స్థలాన్ని కేటాయిస్తామని ఇరిగేషన్ శాఖ ఈస్ట్‌కోస్ట్ చీఫ్ ఇంజినీర్ శంబంగి సుగుణాకర్ తెలిపారు. తాటిపూడి రిజర్వాయర్‌కు స్వర్గీయ బుచ్చి అప్పారావు పేరును నామకరణం చేస్తూ ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. జలాశయం ప్రాంగణంలో బుచ్చి అప్పారావు విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొప్పల వెలమ సంక్షేమ సంఘం తరఫున ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో చీఫ్ ఇంజినీర్ సోమవారం రిజర్వాయర్‌ను, సంఘం నాయకులతో కలిసి సందర్శించారు. విగ్రహస్థాపన కోసం మూడు చోట్ల కొలతలు తీశారు. కార్యక్రమంలో బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మినేని శ్రీనివాస్, రాష్ట్ర కొప్పల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, జాతీయ కన్వీనర్ కొరుపోలు సత్యారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ పి.అప్పలనాయుడు, శీర సత్యనారాయణ, డాక్టర్ బొత్స వర ప్రసాద్, బి.తిరుపతినాయుడు, గేదెల తిరుపతిరావు, తాటిపూడి సర్పంచ్ ఆదిరెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపలో ప్రగతి పథం

- 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంతో గుదిబండ సమస్యల పరిష్కారం
- దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ఇబ్బందుల నుంచి ప్రజలకు ఊరట
- క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలు, అధికారుల పర్యటనలతో సమస్యల గుర్తింపు
- ప్రతి గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో రూ.20 లక్షల చొప్పున నిధుల కేటాయింపు
- జిల్లాలో రూ.70.77 కోట్ల అంచనా వ్యయంతో 2,337 పనులకు ప్రతిపాదనలు
- ఇప్పటివరకూ రూ.60.98 కోట్లతో 2,055 పనుల మంజూరు
- రూ.50.50 కోట్ల విలువైన 1,797 పనులు పురోగతి
- ఇప్పటివరకూ రూ.9.04 కోట్ల విలువైన 315 పనుల పూర్తి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: జిల్లాలో దీర్ఘకాలంగా ప్రజలకు గుదిబండగా ఉన్న సమస్యలన్నింటికి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం చక్కని పరిష్కారం చూపుతోంది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గత ఏడాది మే 11వ తేదీన ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ప్రజలకు వరప్రదాయినిగా మారింది. ప్రతి గడపకూ సంక్షేమ పాలనతో పాటు పల్లె, పట్టణ ప్రాంతాలను ప్రగతిపథంలో నిలుపుతోంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ సంబంధిత ఎమ్మెల్యే, అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలో వెలుగులోకి వచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ/వార్డు సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున అదనపు నిధులను మంజూరు చేస్తోంది. ఇవి చాలకపోతే ఎమ్మెల్యే కోటాలో నిధులను కేటాయిస్తున్నారు. అంతకన్నా మించిపోతే కలెక్టర్ కోటాలో నిధుల కోసం ప్రతిపాదనలు పంపుతున్నారు. ప్రధానంగా క్షేత్రస్థాయిలో రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు, రక్షణగోడలు, శానిటేషన్, సీసీ రోడ్లు, లింక్ రోడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు.

పనుల జోరు

విజయనగరం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు సాలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మెంటాడ సహా 32 గ్రామీణ/అర్బన్ మండలాల్లో జూలై నెలాఖరు నాటికి 2,337 పనులకు ఎమ్మెల్యేలు ప్రతిపాదించారు. వీటి అంచనా విలువ రూ.70.77 కోట్లు. వాటిలో 2,055 పనులు మంజూరయ్యాయి. వీటి అంచనా విలువ రూ.60.98 కోట్లు. వీటిలో రూ.50.50 కోట్ల విలువైన 1,797 పనులు పురోగతిలో ఉన్నాయి. ఇప్పటికే రూ.9.04 కోట్లతో 315 పనులు పూర్తయ్యాయి. 121 పనులకు సంబంధించిన రూ.3.91 కోట్ల మేర బిల్లుల చెల్లింపు కూడా పూర్తయింది.



గతుకుల రోడ్డుకు మోక్షం



ఇది విజయనగరం కార్పొరేషన్ 15వ డివిజన్ పరిధిలోని యాతవీధికి నిర్మించిన పక్కారోడ్డు. గతంలో ఉన్న గతుకుల రోడ్డులో రాకపోకలకు నరకయాతన పడేవారం. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మా వీధికి వచ్చిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి మా డివిజన్ కార్పొరేటర్ అల్లు చాణక్య మా సమస్యను వివరించారు. సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చిన నెల రోజుల్లో పక్కారోడ్డు వేసి కష్టాలు తీర్చారని ఆ వీధికి చెందిన కృష్ణ తెలిపాడు.

నీటి ఇబ్బందులకు చెక్



వేపాడ మండలం బానాది పంచాయతీలో నిత్యం తాగునీటి సమస్య వెంటాడేది. గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వచ్చిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు సమస్యను వివరించారు. ఆయన వెంటనే ఎం.శింగవరం మైచర్లవాని కళ్లాలు వద్ద బోరు తీయించారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారని ఉపసర్పంచ్ కోట్నికృష్ణ ఆనందం వ్యక్తంచేశారు.



కోట్ని కృష్ణ

అవస్థలు తప్పాయి



ఇది రామభద్రపురం మండలం తారాపురం బీసీ కాలనీలో రూ.4లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు. గత ఐదారేళ్ల నుంచి వీధిలో రోడ్డు లేక నానా అవస్థలు పడుతుండేవారు. పాలకులు, అధికారులకు విన్నవించినా ఫలితం ఉండేదికాదు. జగనన్న ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడుతో మా ఇబ్బందులు మొరపెట్టుకోగా ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. రోడ్డు కష్టాలు తీర్చారని పొట్టంగి వెంకట లక్ష్మి తెలిపారు.



పొట్టంగి వెంకటలక్ష్మి

రేషన్ కార్డు మంజూరు చేశారు

గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఎమ్.వెంకటాపురం గ్రామంలో గడపగడప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేటప్పుడు రేషన్ కార్డు లేదని తెలియజేశాను. ఆయన వెంటనే స్పందించారు. రేషన్ కార్డును మంజూరు చేయించారు. – గాదిలక్ష్మి(ఎమ్.వెంకటాపురం)



నిధులు, పనుల ప్రగతి ఇలా...

నియోజకవర్గం	మంజూరైన పనులు	పురోగతిలోనున్న పనులు	పూర్తి అయిన పనులు
రాజాం	281 (రూ.8.01 కోట్లు)	221 (రూ.5.68 కోట్లు)	38 (రూ.1.01 కోట్లు)
బొబ్బిలి	317 (రూ.10.2 కోట్లు)	262 (రూ.7.93 కోట్లు)	61 (రూ.1.70 కోట్లు)
చీపురుపల్లి	244 (రూ.6.39 కోట్లు)	232 (రూ.6.12 కోట్లు)	50 (రూ.1.38 కోట్లు)
నెల్లిమర్ల	333 (రూ.8.45 కోట్లు)	315 (రూ.7.84 కోట్లు)	45 (రూ.1.06 కోట్లు)
విజయనగరం	116 (రూ.6.14 కోట్లు)	68 (రూ.3.34 కోట్లు)	8 (రూ.64 కోట్లు)
ఎస్.కోట	388 (10.2 కోట్లు)	361 (9.31 కోట్లు)	55 (రూ.1.45 కోట్లు)
గజపతినగరం	271 (రూ.9.21 కోట్లు)	243 (రూ.8.18 కోట్లు)	48 (రూ.1.61 కోట్లు)
సాలూరు (మెంటాడ)	105 (రూ.2.43 కోట్లు)	95 (రూ.2.11 కోట్లు)	10 (రూ.21 లక్షలు)

శ్మశానవాటికకు రోడ్డు



చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని వంగపల్లిపేట గ్రామంలోని శ్మశానవాటికకు రోడ్డు సౌకర్యం ఉండేది కాదు. వర్షాకాలంలో మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించేందుకు నానా అవస్థలు పడేవారం. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద గ్రామానికి వచ్చిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, స్థానిక పాలకుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. వెంటనే రూ.10 లక్షలు నిధులు మంజూరు చేశారు. 300 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మించి 'అంతిమ' కష్టాలు తీర్చారని వంగపల్లిపేట ఎంపీటీసీ సభ్యుడు గిరడ రామ్‌దాస్ హర్షం వ్యక్తంచేశారు.



గిరడ రామ్‌దాస్

తొలగిన మురుగు సమస్య



రాజాం మండలం బూరాడపేట గ్రామంలో డ్రైనేజీ సమస్య ప్రజలను వెంటాడేది. పలుమార్లు ఇంజినీరింగ్ అధికారులు ఎస్టిమేషన్ వేసినా నిధులు విడుదలకాక కాలువ నిర్మాణానికి ఆటంకం కలిగేది. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు వచ్చినప్పుడు సమస్యను వివరించాం. రూ.5లక్షల మంజూరు చేయించి 500 మీటర్ల మేర కాలువను నిర్మించారు. డ్రైనేజీ సమస్యను తొలగించారని సర్పంచ్ వంజరాపు విజయ్‌కుమార్ తెలిపారు.



వంజరాపు విజయ్‌కుమార్

విద్యార్థులకు తొలగిన దారి కష్టాలు



ఇది గుర్ల మండల కేంద్రంలోని రాజావీధి నుంచి గరికివలస వరకు వేసిన సీసీ రోడ్డు. గతంలో బురదమయంగా ఉండేది. వర్షం కురిస్తే రాకపోకలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడేవారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామానికి వచ్చిన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. ఆయన రూ.10లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయించారు. దారి కష్టాలు దూరం చేశారని వాల్లె భాను చంద్రరావు తెలిపారు.



వాల్లె భాను చంద్రరావు

మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



బొండపల్లి మండలంలోని అంబటివలసలో దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని మురుగునీటి సమస్యకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్యకు సమస్యను వివరించడంతో రూ.5 లక్షలతో సీసీ కాలువ నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారని అప్పలనాయుడు తెలిపారు.



తాళ్లపూడి అప్పలనాయుడు

బడ్డుకొండ చొరవతో..

పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారమైంది. కుమిలి-1, కుమిలి-2 సచివాలయాల పరిధిలోని అభివృద్ధి పనులకు గడపగడపకు మన ప్రభుత్వం కింద రూ.40లక్షల నిధులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చొరవతో తెలగవీధి, బొండావీధి, దేవాంగుల వీధి, రెల్లివీధిలో డ్రైనేజీలు నిర్మించారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారమయ్యాయి. – సురేష్‌రెడ్డి, కుమిలి, పూసపాటిరేగ మండలం



చేనేత కార్మికులకు ఆర్థిక అండ



కలెక్టరేట్ ఆడిటోరియం వద్ద చేనేత వస్త్ర ప్రదర్శనశాలను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్

- వైఎస్సార్‌సీపీ హయాంలోనే అధిక లబ్ధి
- కార్మికుల జీవితాల్లో ఆర్థికోన్నతి
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

విజయనగరం అర్బన్: చేనేత కార్మికులకు అన్ని విధాలా అండగా నిలిచిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్వజన ఆస్పత్రి కూడలి నుంచి కలెక్టరేట్ వరకు హ్యాండ్ లూమ్ వాక్ నిర్వహించారు. కలెక్టరేట్ ఆడిటోరియం వద్ద చేనేత వస్త్ర ప్రదర్శనశాలను ప్రారంభించారు. జిల్లా అధికారులు, సిబ్బంది చేనేత వస్త్రాలను ధరించారు. చేనేత ప్రాశస్త్యాన్ని పాఠశాలల విద్యార్థులకు వివరించారు. అనంతరం పలువురు చేనేత కార్మికులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ ప్రజా సంకల్ప యాత్రలో చేనేత కార్మికుల కష్టాలను తెలుసుకున్నారని, అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలతో ఆదుకున్నారన్నారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద ఏటా రూ.24 వేలు చొప్పున జిల్లాలోని 3,595 మంది చేనేత కార్మికులకు ఆర్థిక ప్రయోజనం కల్పిస్తున్నారన్నారు. ముద్ర పథకం కింద చేనేత సొసైటీలకు రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు డీసీసీబీ నుంచి రుణాలను ఇప్పిస్తున్నారన్నారు. చేనేత కార్మికుల వయస్సు 50 ఏళ్లు నిండితే చాలు పింఛన్ మంజూరు చేస్తున్నట్టు వివరించారు. విజయనగరం జిల్లాలో 3,165 మంది నేతన్నలు చేనేత పింఛన్ పొందుతున్నట్టు వెల్లడించారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో కార్మికుల్లో ఆర్థికోన్నతి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అనంతరం సుదీర్ఘ కాలంగా వృత్తిని కొనసాగిస్తున్న సీనియర్ చేనేత కార్మికులు ఎం.పెంటయ్య, బల్ల ఈశ్వరరావు, నాయుడు సత్యారావులకు జెడ్పీ చైర్మన్ సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వెలమకార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, చేనేత జౌళిశాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.వసంతసాయి, సిబ్బంది, వివిధ చేనేత సొసైటీలు, నేత కార్మికులు పాల్గొన్నారు.

దేశభక్తి ఉప్పొంగేలా జెండా పండగ

- ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ స్ఫూర్తిని ప్రజల్లో నింపాలి
- ప్రగతిని ప్రజలకు వివరించేలా నగర కూడళ్లలో శకటాల ప్రదర్శన
- ఏర్పాట్లపై సమీక్షించిన ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్‌అశోక్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్‌అశోక్

విజయనగరం అర్బన్: ఆజాది కా అమృత్ మహోత్సవ్ స్ఫూర్తిని నింపేలా, ప్రతి ఒక్కరిలో దేశభక్తి ఉప్పొంగేలా 77వ స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. గతం కంటే మిన్నగా.. మరింత గొప్పగా వేడుకలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ శాఖల పనితీరును, ప్రగతిని ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రజల సమక్షంలో శకటాల ప్రదర్శన నిర్వహించాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు, ఇతర అంశాలపై ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ జిల్లా స్థాయి అధికారులతో సోమవారం సమీక్షించారు. ప్రభుత్వ పనితీరు, ప్రగతి గురించి ప్రజలకు తెలిపేందుకు శకటాల ప్రదర్శన ఉత్తమ మార్గమన్నారు. కొత్త అంశాలను తీసుకొని శకటాలను ప్రదర్శించాలని ఆదేశించారు. స్టాళ్ల ఏర్పాట్లలో నూతనత్వం కనిపించాలన్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో ప్రాథమిక ప్రదర్శన అయిన వెంటనే శకటాలను విజయనగరంలోని ప్రధాన కూడళ్ల మీదుగా తీసుకెళ్లి ప్రజలకు అత్యంత చేరువుగా ప్రదర్శించాలని స్పష్టంచేశారు.

ఒక రోజు ముందుగానే కలెక్టరేట్ భవనాలను విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్వో ఎం.గణపతిరావు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు

రేపటి నుంచి నా భూమి-నా దేశం

ప్రజల్లో దేశభక్తిని నింపేందుకు, మరింత ఉత్తేజపరిచేందుకు ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా ఈ నెల 9 నుంచి 15వ తేదీవరకు 'నా భూమి- నా దేశం' కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేసిన వీరులు, త్యాగధనులను స్మరించుకునేందుకు మన జిల్లాలో గ్రామగ్రామాన, పట్టణాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో 'నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో అధికారులతో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమృత్‌సరోవర్ కింద అభివృద్ధి చేసిన చెరువుల వద్ద స్వాతంత్ర్యోద్యమ నాయకుల పేర్లతో కూడిన శిలాఫలకాలు ఏర్పాటుచేయాలన్నారు. వీరులకు వందనం పేరుతో సమరయోధులు, వీర సైనికులు, అమరవీరుల కుటుంబాలకు చెందిన వ్యక్తులను సత్కరించాలని సూచించారు.

ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటి సంరక్షించాలని ఆదేశించారు. యువతలో స్వాతంత్ర్య స్ఫూర్తి నింపాలన్నారు. సమావేశంలో జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ రాజ్‌కుమార్, డీఈఓ లింగేశ్వరరెడ్డి, సెట్విజ్ సీఈఓ రాంగోపాల్, యూత్ ఆఫీసర్ ఉజ్వల్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యోగా శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం


మాట్లాడుతున్న యోగా కోర్సు డైరెక్టర్లు

బొబ్బిలి: యోగా కోర్సుల్లో పీజీ, పీజీ డిప్లమో, పీహెచ్‌డీ కోర్సులకు ఆంధ్రా యూనివర్సిటీ ఆహ్వానం పలుకుతోందని పట్టణంలోని శ్రీయోగ విద్యాసంస్థ కోర్సు డైరెక్టర్లు ఎంఈవీ ప్రసాద్, కె.సత్య తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మా శ్రీ యోగా సంస్థలో ఆరు నెలల డిప్లొమో కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు ఎంఓయూ కుదిరించదన్నారు. ఉమ్మడి జిల్లాలో ఆంధ్రాయూనివర్సిటీ అనుమతించిన ఏకైక యోగా విద్యా సంస్థ తమదేనన్నారు.ఆరు నెలల యోగా కోర్సు కోసం రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500 డీడీ తీసి చేరాలని సూచించారు. రూ.10వేల కోర్సు ఫీజుతో ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాల్సి ఉందన్నారు, మా సంస్థకు ఎటువంటి రుసుమూ చెల్లించనవసరం లేదని స్పష్టం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలోని విజయనగరం ప్యాలస్ ద్వారా కోర్సుకు అప్లై చేసుకోవాలని, లేదా ఫోన్ 9988229011,7013969066 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

7తులాల బంగారం చోరీ

జామి: మండలంలోని భీమసింగి గ్రామంలో 7తులాల బంగారు అభరణాలు చోరికి గురయ్యాయి. గ్రామానికి చెందిన గురునాయుడు తన కుమార్తె వివాహం నిమిత్తం బంగారం హారం, తాడు, తదితర వస్తువులు కొని ఇంట్లో బీరువాలో భద్రపరిచాడు, ఆదివారం రాతిర ఉక్కపోత వల్ల కుటుంబసభ్యులు మేడపైన ఇంట్లో పడుకున్నారు. సోమవారం ఉదయం గురునాయుడు కుటుంబసభ్యులు కిందికి దిగి చూడగా ఇంటికి ఉన్న తాళం పగులగొట్టి తలుపులు తీసి ఉన్నాయి. దీంతో ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువా తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉండడంతో బంగారం చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు క్లూస్ టీం బృందం వచ్చి వేలిముద్రలు సేకరించింది. ఘటన స్థలానికి వచ్చిన సీసీఎస్ ఎస్సై బుచ్చిరాజు, ఎస్.కోట సీఐ బాల సూర్యారావు జరిగిన ఘటనపై ఆరా బాధితులను అడిగితెలుసుకున్నారు.

వసంత్ విల్లాలో చోరీ

విజయనగరం క్రైమ్: స్థానిక ధర్మపురి వసంత విహార్ విల్లాలో ఆదివారం చోరీ జరిగింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వసంత విహార్ విల్లా 49లో నివాసం ఉంటున్న వర్రి శ్రీనివాసరావు గంట్యాడ మండలం డీకే పర్తిలో సచివాలయ సంక్షేమం, విద్యాసహాయకుడిగా పనిచేస్తున్నాడు. ఆరోతేదీన ఆయన అత్తవారింటికి డెంకాడ వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం విరగ్గొట్టి, తలుపులు తెరిచి ఉండడం గమనించాడు. బెడ్‌రూం బీరువా, కప్‌బోర్డు తెరిచి వస్తువులన్నీ చిందరవందరగా ఉండడంతో బీరువాలో ఉన్న ఆరుతులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి వస్తువులు , కొంతనగదు పోయినట్లు గుర్తించారు. సమాచారం మేరకు రూరల్ సీఐ తిరుపతిరావు, ఎస్సై గణేష్‌లు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గణేష్ తెలిపారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి

● ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్


వినతులను స్వీకరిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అందే ప్రతి వినతిని క్షేత్రస్థాయిలో ఏ విధంగా పరిష్కరిస్తున్నారనే అంశంపై మండల ప్రత్యేకాధికారులు తప్పనిసరిగా సమీక్షించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. వివిధ శాఖలకు అందుతున్న వినతులు, అర్జీదారులు సమస్యలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించే రీతిలో తగిన చర్యలు తీసుకుంటున్నదీ లేనిదీ పర్యవేక్షించాలని కోరారు. మండలాల్లో అధికారులతో సమావేశాలు నిర్వహించేటప్పుడు ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జగనన్నకు చెబుదాం వినతుల పరిష్కారంపై ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్ సోమవారం జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సమీక్షించారు. ఇటీవల ఉద్యోగుల వినతుల స్వీకారం కోసం నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో పలు శాఖల ఉద్యోగుల నుంచి అందిన వ్యక్తిగత వినతుల పరిష్కారంపై కూడా తీసుకున్న చర్యలను తెలుసుకున్నారు. జగనన్నకు చెబుదాంలో భాగంగా పలు వర్గాల నుంచి 325 వినతులు అందాయి. జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతి రావు, ఆర్‌డీఓ ఎం.వీ.సూర్యకళ, కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, డిప్యూటీ కలెక్టర్లు పద్మలత, సుధారాణి, లావణ్య వినతులు స్వీకరించారు.

ఎస్పీ స్పందనకు 45 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆమె నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి 45 ఫిర్యాదులు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వారితో మాట్లాడారు. అనంతరం ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, దిశా డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐలు కేకేవీ విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

సంతృప్తికర పరిష్కారం చూపాలి


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

● కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సకాలంలో సంతృప్తికర పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జగన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఆర్.గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, జిల్లారెవెన్యూ అధికారి జె.వెంకటరావులతో కలిసి ప్రజలనుంచి ఆయన వినతులు స్వీకరించారు. ప్రజాసమస్యలపై జిల్లా అధికారులు, మండల అధికారులతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు పలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 105 అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి. జగన్నాథ రావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్ర రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్, ఎస్బీ సీఐ సీహెచ్ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ ప్రభాకర్, ఏఆర్ ఆర్‌ఐ శ్రీరాములు, డీసీఆర్‌బీ ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై లైంగిక వేధింపుల కేసు

● పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

వంగర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినిని వేధిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు పాఠశాలలో పనిచేస్తున్న ఎస్ఎస్ ఉపాధ్యాయుడు బండి రాముడుపై వంగర పోలీసులు కేసు నమోదు చేశారు. తమ కుమార్తెతో ఉపాధ్యాయుడు అసభ్యకరంగా మాట్లాడుతూ లైంగికంగా వేధిస్తున్నాడంటూ బాలిక తల్లిదండ్రులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర ఆదేశాల మేరకు సంతకవిటి ఎస్సై బుదుమూరు లోకేశ్వరరావు వంగర చేరుకుని విచారణ చేపట్టారు. ప్రత్యేక తరగతుల పేరిట ముందస్తుగా పాఠశాలకు రావాలని చెప్పడం, అందరిలో బాలిక పట్ల వికృత చేష్టలు చేసిన ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్టుచేసిన ఉపాధ్యాయుడు వాట్సాప్‌లో మెసేజ్‌లు చేసేవాడని బాధిత బాలిక తల్లిదండ్రులు విచారణలో తెలియజేశారు. ఈ మేరకు ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై లోకేశ్వరరావు తెలిపారు.


ఎస్సై లోకేశ్వరరావుతో మాట్లాడుతున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

ఎస్.ఎస్.ఉపాధ్యాయుడు బండి రాముడుపై సస్పెన్షన్ విధిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు జారీ చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం ముద్దాడ రమణమ్మ తెలిపారు.

ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలి

అభంశుభం తెలియని బాలికపై అసభ్యకరంగా వ్యవహరించి, లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ కోరారు. పాఠశాలలో జరిగిన విషయాన్ని తెలుసుకుని హుటాహుటిన ఆయన పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సై లోకేశ్వరరావుతో మాట్లాడారు.

పల్సర్ బైక్ రమణ సినిమా షూటింగ్ సందడి


మాట్లాడుతున్న బేబీ-2.0 చిత్రయూనిట్

విజయనగరం టౌన్: పల్సర్ బైక్ రమణ సినిమా షూటింగ్ సందడి జిల్లా కేంద్రంలో సోమవారం నెలకొంది. రమణ నటిస్తున్న ఈ చిత్రానికి బేబీ 2.0 టైటిల్ ఖరారు చేశామని దర్శకుడు కుమారస్వామి తెలిపారు. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఇప్పుడున్న యూత్‌కు చిత్రం కనెక్ట్ అవుతుందని చిత్రయూనిట్ పేర్కొంది. హీరోయిన్ సోనీరెడ్డి, ప్రతినాయకుడిగా ప్రశాంత్ చిత్రంలో నటిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా హరీష్ కోరాడ, ఎడిటర్ ప్రసాద్, పాటలు, సంగీత దర్శకుడి జాన్ వ్యవహరిస్తున్నారు. షూటింగ్‌ను వీక్షించేందుకు స్థానికులు, ఔత్సాహికులు తరలివచ్చారు.

విజయనగరంలో రూ.46 కోట్లతో అమృత్ ప్రాజెక్టులు

విజయనగరం: పట్టణంలో రూ.46.96 కోట్లతో అమృత్ పథకం కింద రెండు నీటిసరఫరా ప్రాజెక్టులు, ఒక సెవేజ్, సెప్టేజ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టుతో పాటు మూడు పార్కుల అభివృద్ధి చేపట్టామని, పనులు వివిధ దశల్లో ఉన్నాయని విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు మంత్రి కౌశల్ కిశోర్ జవాబిచ్చారు.

100లీటర్ల సారా పట్టివేత

వీరఘట్టం: సారా అమ్మకాలు, రవాణాపై పోలీసులు సోమవారం మండల వ్యాప్తంగా సోదాలు చేశారు. ఈ క్రమంలో చిదిమి గ్రామ సమీపంలోని మామిడి తోటలో ఉంచిన సారాను గుర్తించి నిందితుడు శ్రావణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎంవీ రమణ తెలిపారు. ఈ సోదాల్లో 100లీటర్ల సారాతోపాటు స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సాలూరులో 200 సారా ప్యాకెట్లు..

సాలూరు: పట్టణంలో ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 200 సారా ప్యాకెట్లు పట్టుకున్నామని ఎస్సై భాస్కరరావు తెలిపారు. బంగారమ్మ కాలనీ వద్ద సారా ప్యాకెట్లు తరలిస్తున్న వంతల సూరిబాబు, బంకా సింహాద్రిలను అదుపులోకి తీసుకుని బైక్ సీజ్ చేసినట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా, స్కూటీ

సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

విజయనగరం ఫూల్‌బాగ్: మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) విజయనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి పార్టీ దండాలతో నిరసన వ్యక్తం చేశారు. దీంతో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్రావు, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు జగన్మోహన్‌రావు, సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ, జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు మున్సిపల్ యూనియన్ నాయకులు టి.బాబురావు, ఎం దుర్గారావు, జలగడుగుల బాలరాజు, జలగడుగుల గణపతి, జలగడుగుల సీతారాం లను పోలీసులు అరెస్టు చేసి ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడిచిపెట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

హత్యకేసులో ముద్దాయికి జీవిత ఖైదు

విజయనగరం క్రైమ్: హత్యకేసులో నేరారోపణ రుజువు కావడంతో ముద్దాయికి జీవిత ఖైదు, రూ.పదివేలు జరిమానా విధిస్తూ విజయనగరం ఫోర్త్ ఏడీజే/ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి షేక్ సికిందర్ బాషా సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఆండ్ర ఎస్సై సిద్ధార్థ కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు వివరాలపై ఆయన మాట్లాడుతూ ఆండ్ర పోలీస్‌స్టేషన్ పరిధి మెంటాడ గ్రామానికి చెందిన కొల్లి కొండమ్మ భర్త సత్యనారాయణ, ఇల్లరికం వచ్చారన్నారు. ఇల్లరికం వచ్చిన అల్లుడు, కుమార్తెకు ఆస్తిలో వాటా ఇచ్చేందుకు కొండమ్మ తండ్రి సమ్మతించాడు. అయితే ఆయన తమ్ముళ్లు రాయిపల్లి అచ్చియ్య (ఎ1), సీతన్న (ఎ2), మరదలు గౌరమ్మ (ఎ3)ఆస్తిలో వాటా ఇచ్చేందుకు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆస్తి విషయమై కుటుంబసభ్యుల మధ్య తగాదా ఏర్పడడంతో 2018 జూన్ మూడో తేదీన రాత్రి తన భర్తను బంధువులు హత్యచేసినట్లు జూన్ 4న ఆండ్ర పోలీస్‌స్టేషన్‌లో కొండమ్మ ఫిర్యాదుచేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నిందితుడు రాయిపల్లి అచ్చియ్య (ఎ1)పై నేరారోపణలు రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు వెల్లడించారని ఎస్సై తెలిపారు. ఎ2, ఎ3లపై నేరారోపణలు రుజువు కాకపోవడంతో వారిని నిర్దోషులుగా పరిగణించారని చెప్పారు. బాధితురాలి తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీఎస్ జయలక్ష్మి వాదనలు వినిపించారు.

లారీ, బైక్ ఢీ: ఒకరి మృతి

పార్వతీపురం: కొమరాడ మండలంలోని కూనేరులో బైక్‌ను లారీ ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ద్విచక్రవాహన చోదకుడు మృతి చెందాడు. ఈ ఘటనపై సోమవారం పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం విక్రాంపురం గ్రామానికి చెందిన దండుపాటి రాములు(55) గ్రామం నుంచి కూనేరుకు చేపలు విక్రయించేందుకు ద్విచక్రవాహనంపై ఆదివారం వెళ్లాడు. చేపల విక్రయం అనంతరం స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా పార్వతీపురంనుంచి రాయగడ వస్తున్న లారీ, కూనేరు–రామభద్రపురం సమీపంలో ఢీకొంది. దీంతో రాములుకు తీవ్ర గాయాలు కాగా వెంటనే చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు కొమరాడ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతిచెందిన రాములు

13 కేజీల గంజాయి స్వాధీనం

పాచిపెంట: ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న 13 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఫకృద్దీన్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన బత్తిన చందు, తుమ్మ నాగరాజులు ఒడిశాలోని జైపూర్ నుంచి ఆర్టీసీ బస్సులో గంజాయిని సాలూరు వైపు తరలిస్తుండగా పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద పట్టుకున్నామన్నారు. ఆ నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో తూకం వేసి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.


పట్టుబడిన గంజాయిని రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో తూకం వేస్తున్న ఎస్సై ఫకృద్దీన్

కైలా జంక్షన్ మరో 10కేజీలు..

గజపతినగరం: మెంటాడ మండలం కైలాం జంక్షన్ వద్ద 10 కేజీల గంజాయి తరలిస్తున్న ఒడిశా వాసిని పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన గజపతినగరం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒడిశాలోని కొరాపుట్ జిల్లా బంగి పుట్ గ్రామానికి చెందిన జయరామ్ గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆండ్ర ఎస్సై సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

20కిలోల గంజాయి పట్టివేత

విజయనగరం క్రైమ్: స్థానిక లంకాపట్నం ఎఫ్‌సీ గోడౌన్ సమీపంలో సోము ఆదిబాబు 20 కిలోల గంజాయిని తీసుకువెళ్తుండగా టూటౌన్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనలో మరో నలుగురు వ్యక్తులు పరారీలో ఉన్నారని కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఎల్ అప్పలనాయుడు

గొంతుకోసి పరారైన అగంతుకుడు

పార్వతీపురం: గుర్తు తెలియని వ్యక్తి గొంతుకోసి పరారవడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన పట్నాన నాగరాజు సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి నాగరాజు ముఖంపై ముసుగువేసి గొంతు కోసి పరారయ్యాడు. ఈఘటనలో నాగరాజు గొంతువద్ద బలమైన గాయం కావడంతో చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని సర్పంచ్ జె.ప్రవీణ్‌కుమార్ పోలీసులకు తెలియజేయగా రూరల్ ఎస్సై వై.సింహాచలం కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన నాగరాజు

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹ 190